డివిజన్లలో సమస్యలన్నీ పరిష్కరించాం

'డబుల్' ఇళ్లు ఎక్కడా? అని ప్రజలు అడుగుతున్నారు

ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



బాలానగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లోని శ్రీస్ఫటిక లింగేశ్వరస్వామి సహిత శ్రీకనకదుర్గ దేవి ఆలయంలో కాంగెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ మంగళవారం పూజలు చేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీకాలనీ, వినాయక్‌నగర్, సాయినగర్, కళ్యాణ్‌నగర్, చరబండరాజు కాలనీ, దాసరి బస్తీ, కుమ్మరి బస్తీ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కాలనీల్లో ప్రజలకు రెండు పడకల ఇళ్లు ఎక్కడ? ఎవరికి ఇచ్చారు? ఎంతమందికి ఇచ్చారో? చెప్పగలరా అని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. పెన్షన్లు రాక అనేక మంది అల్లాడిపోతున్నారని అన్నారు. కేసీఆర్ రూ.80వేల పిట్టల దొర పుస్తకాలు చదివి పిట్టకథలు చెబుతూ ప్రజల్లో పువ్వులు పెట్టి ఓట్లు వేసుకొని గెలిచారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈసారి కాంగ్రెస్‌కే ఓటు వేస్తామని ప్రజలు చెబుతున్నారని అన్నారు. ఇందిరాగాంధీ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మధు, యూత్ ప్రెసిడెంట్ భరత్, మహిళా అధ్యక్షురాలు రేణుక, నాయకులు అనిల్ కుమార్, పుష్పారెడ్డి, మహేందర్, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నర్సింగ్‌రావు బాశెట్టి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మంగళవారం స్వతంత్ర అభ్యర్థి నర్సింగ్ రావు బాశెట్టి నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు.

రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశాం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



జయానగర్‌కాలనీలో నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయ నగర్‌కాలనీలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లు నార్నె శ్రీనివాస రావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీ గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో అభివృద్ధి, సంక్షేమం అనే నినాదంతో రూ.9వేల కోట్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గంలో మరింత అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, పలు సంక్షేమ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జనసేన పార్టీ అభ్యర్థిగా ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థిగా ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్‌ను ప్రకటిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. కూకట్‌పల్లిలో ప్రముఖ బిల్డర్‌గా ఉన్న ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ రెండు నెలల క్రితమే బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్యే కృష్ణారావుకు వేయి రెడ్డి కుటుంబీకుల మద్దతు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గ రెడ్డి కుటుంబీకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో రెడ్డి కుటుంబాలకు చెందిన వెయ్యి మంది పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని పలు జిల్లాలకు చెందిన రెడ్డి కుటుంబీకులు కూకట్‌పల్లి ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా హాజరైన రెడ్డి కుటుంబీకులు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావును కలిసి ఘనంగా సన్మానిచ్చారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రెడ్డి కుటుంబీకులు మద్దతు ప్రకటించడం పట్ల హర్షం వెలిబుచ్చారు. కూకట్‌పల్లిలోని రెడ్డి కుటుంబీకులకు ఎల్లవేలాల అందుబాటులో ఉంటానన్నారు. ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో స్వర్గీయ రాజశేఖరరెడ్డి పేరుతో కూకట్‌పల్లి ప్రాంతంలో పార్కును నిర్మించి కమ్యూనిటీహాల్ను కూడా నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గడిచిన ఎన్నికల్లో కూడా రెడ్డి కురుంబీకులు పూర్తి మద్దతు ప్రకటించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వర్షం కురిసినప్పటికీ రెడ్డి కుటుంబీకులు పెద్ద సంఖ్యలో తనకు మద్దతు తెలిపినందుకు రావడం పట్ల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్బీస్టేడియంలో జరిగిన బీసీ ఆత్మగౌరవ సభకు హాజరైన మేడ్చల్ జిల్లా పన్నాల హరీష్‌చంద్రారెడ్డి, నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాధవరం కాంతారావు – కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- అల్లాపూర్ డివిజన్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం
- ఎన్నికల ప్రచారంపై కార్యకర్తలకు దిశానిర్దేశం



కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని చంద్రగార్డెన్స్‌లో మంగళవారం బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లు ఏ విధంగా ఉండేవో, ప్రస్తుతం ఏ విధంగా ఉందో ప్రజలు గమనించాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కరెంట్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని అంతేకాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ వంటి పథకాలు అల్లాపూర్ డివిజన్‌లో అత్యధిక మందికి ఇచ్చామన్నారు.

◆ నేడు గల్లీ గల్లీకి సీసీ రోడ్డు, ఇండోర్ స్టేడియాలు, ట్రాఫిక్ సమస్యను అరికట్టడానికి కైత్లాపూర్ ఫ్లై ఓవర్ నిర్మించామన్నారు. వర్షం వస్తే అల్లాపూర్ ప్రజలు ఎంతో ఇబ్బందులు పడేవారని, నేడు నాలాలు అభివృద్ధి చేసి సమస్యను అరికట్టామని తెలిపారు.

◆ అదే విధంగా శివాజీనగర్‌లో రోడ్డు సమస్య ఉండేదని ఒక మహిళ తన దృష్టికి తీసుకురాగా స్వయంగా రంగంలోకి దిగి ఆ పనులు పూర్తి చేశామన్నారు. యూసుఫ్‌నగర్ హిందూ శ్మశాన వాటికలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించామన్నారు. సర్వే నెంబర్ 18భూమి సమస్యను పరిష్కరించి ముస్లిం, హిందూ పేద ప్రజల కోసం హైస్కూలు నిర్మించబోతున్నామన్నారు. వివేకానందనగర్‌లో కమిటీహాల్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

◆ కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ... గతంలో కంటే అఖండ మెజార్టీతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును గెలిపించుకుంటామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని డివిజన్ ప్రజల తరపున హామీ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, నాయకులు వీరారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, అబ్దుల్ రహీం, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ప్రధాన కార్యదర్శి ముత్యాల దుర్గ, సయ్యద్ నజీమా, అనుబంధ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అన్ని బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వార్డు, ఏరియా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



చంద్రాగార్డెన్స్‌లో అల్లాపూర్ డివిజన్ బూత్‌స్థాయి కార్యకర్తలు

బేగంపేటలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ బేగంపేట సమస్యలను పట్టించుకోలేదు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ బేగంపేట ప్రజల కష్టాలను ఏనాడూ పట్టించుకోలేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలో వరద ముంపు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్ వ్యాప్తంగా మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరితో కలిసి ప్రకాష్‌నగర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, మయూరి మార్గ్, మాతాజీనగర్, శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా మంగళ హారతులు, బతుకమ్మలతో స్వాగతం పలికారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శ్యాంలాల్ బిల్డింగ్ శ్మశానవాటిక స్థలం కోసం ఎంతగానో పోరాడి సాధించానన్నారు. అల్లంతోటబావి, మయూరిమార్గ్ ప్రాంతంలో వరదనీరు నిలవకుండా పోరాడి పట్టా స్థలంలో నుంచి పైప్‌లైన్లను వేయించినట్లు చెప్పారు. డివిజన్ ప్రజలకు ఇంటింటికీ మంచినీళ్ల అందించామన్నారు. బేగంపేట నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిపి ఇళ్లలోకి నీరు రాకుండా చేశామన్నారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బేగంపేట ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. అబద్ధాలను ప్రచారం చేసి పబ్బం గడుపుకునే ఆ పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, సురేష్ యాదవ్, రాజయ్య, అమరం శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు తిరుపతిరావు

అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: డబ్ల్యూపీసీ నేషనల్–2023లో భాగంగా బెంగుళూరులో జరిగిన చాంపియన్‌షిప్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం మోతీనగర్‌కు చెందిన ఈగల తిరుపతిరావు పవర్ లిఫ్ట్ 220 కేజీల విభాగం, బెంచ్ ప్రెస్ 120 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. అదే విధంగా జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తిరుపతిరావును అభినందించారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులను క్రీడల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. క్రీడలకు సంబంధించి అన్ని సౌకర్యాలను కూకట్‌పల్లి నియోజకవర్గంలో అందిస్తున్నామని పేర్కొన్నారు.



పవర్‌లిఫ్ట్‌లో బంగారు పతకం సాధించిన తిరుపతిరావును అభినందించిన ఎమ్మెల్యే

శ్రీవారికి అభిషేకం

హఫీజ్‌పేట్ : వేంకటేశ్వరస్వామి అష్టవింశ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నిత్యోపాసన, ఉత్సవాన్త స్నపనంను వైభవంగా నిర్వహించారు. ఉదయం మహా సుదర్శన హోమం, మధ్యాహ్నం 12.00 గంటలకు హారతి తీర్థప్రసాదాలు అందించారు. శ్రీవారికి పుష్పాలంకరణ, గరుడ వాహన సేవ, అన్నప్రసాద వితరణ, సహస్ర దీపాలంకార సేవను కె.సత్యనారాయణ రాజు నిర్వహించారు.



కాకినాడలో జరిగే కబడ్డీ పోటీలకు జేఎన్‌టీయూహెచ్ జట్టు



కాకినాడలో జరిగే కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కె. విజయ్‌కుమార్‌రెడ్డి

బాలానగర్: కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే సౌత్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు హైదరాబాద్ జేఎన్‌టీయూ కబడ్డీ జట్టు ఎంపికైనట్లు స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొ. డా.ఎస్ఎన్.దిలీప్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్‌రెడ్డికి పరిచయం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోటీలకు వెళ్లే వారికి అన్నిరకాలుగా అండగా ఉంటామన్నారు. క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ డా. ఎన్.అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విజయం సాధించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డా.సయ్యద్ మహ్మద్ అలీ అహ్మద్, డాక్టర్ మధు

మాదాపూర్: బోదకాలు (50 కేజీల) సమస్యతో బాధపడుతున్న సోమాలియా యువతికి మెడికవర్ ఆసుపత్రి డాక్టర్లు విజయవంతంగా చికిత్స నిర్వహించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో డాక్టర్ సయ్యద్ మహ్మద్ అలీ అహ్మద్, డాక్టర్ మధులు మాట్లాడుతూ సోమాలియాకు చెందిన 18 సంవత్సరాల యువతికి గత 7 సంవత్సరాల నుంచి ఎడమకాలు వాపు ఉంది. క్రమంగా వాపు పెరగడం మొదలైంది. పలు హాస్పిటళ్లను సంప్రదించినప్పటికి ఫలితం లేకపోవడంతో చివరికి మెడికవర్ ఆసుపత్రికి చేరుకున్నారు. రోగికి లింఫెడెమా నాస్ట్రస్ వెరుకోసా (బోదకాలు) అని గుర్తించి డాక్టర్లు దశలవారీగా శస్త్రచికిత్స ద్వారా కణజాలాలను తొలగించారు. సమావేశంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకురావాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండింగ్ ఆఫీసర్–1 కల్నల్ రవీంద్రరావు

రాయదుర్గం: రక్తదానం చేయడానికి ఔత్సాహిక యువత ముందుకు రావాలని తెలంగాణ ఆర్‌టీ బ్యాటరీ ఎన్‌సీసీ హైదరాబాద్ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్–1 కల్నల్ బి రవీంద్రరావు సూచించారు. మనూ విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటర్‌లో మనూ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, విక్టోరియా వెల్ఫేర్ సొసైటీ, శ్రీకర బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. 100 మంది విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది రక్తదానం చేశారు.

ఎర్రచందనం చెట్లకు సెన్సార్ చిప్‌ల అమరిక

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో 50 ఎర్ర చందనం చెట్లకు రియల్ టైమ్ మానిటరింగ్ ఐఓటీ ఎలక్ట్రానిక్ చిప్ సెన్సార్‌ను అమర్చినట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం సీబీఐఓటీ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన ఎలక్ట్రానిక్ చిప్ సెన్సార్ గురించి డెమో, సెమినార్‌ను మంగళవారం బొటానికల్ గార్డెన్‌లోని సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిప్ అమర్చిన చెట్లను ఎవరైనా నరికి వేయాలనుకున్నా, దొంగిలించాలనుకున్నా సెక్యూరిటీ మొబైల్‌కు సందేశం వస్తుందని, అలాగే బొటానికల్ గార్డెన్‌లో అమర్చిన హంటర్ పరికరాన్ని యాక్టివేట్ చేయడం ద్వారా ఎలక్ట్రానిక్ సైరన్ మోగి సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ అవుతారని చెప్పారు. సమావేశంలో టీఎస్ఎఫ్‌డీసీ ఎకో టూరిజమ్ ప్రాజెక్టు మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్లు లక్ష్మారెడ్డి, మధుసూదన్, సీబీఐఓటీ టెక్నాలజీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్‌విష్ణు, టీఎస్ఎఫ్‌డీసీ శాంసన్‌రాజు, వీరబాబు, వెంకటేష్, ఎఫ్‌సిఆర్ఐ, తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కంటోన్మెంట్ బోర్డు, హెచ్ఎండీఏ, హెచ్‌సీయూ, ఎన్‌జీఆర్ఐ, బయోడైవర్సిటీ బోర్డు, ఎన్ఐఆర్‌డీ, టీఎస్‌పీఏ, జీహెచ్ఎంసీ, ఓయూ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.